బోనస్.. లాస్

• సన్న రకాలను మిల్లులకు తరలిస్తున్న రైతులు
• ప్రోత్సాహకం కోల్పోతున్న వైనం • కనీస ధరతోనే సరిపెడుతున్న మిల్లర్లు


హుజూరాబాద్‌లోని ఓ రైస్ మిల్లుకు తీసుకొచ్చిన సన్నరకం ధాన్యం బస్తాలు

హుజూరాబాద్: సన్నధాన్యం విక్రయాల్లో రైతులకు అన్యాయం జరుగుతోంది. పచ్చివడ్లు కొంటున్నామనే నెపంతో మిల్లర్లు కనీస మద్దతు ధరకే పరిమితమవడంతో గతేడాది వచ్చిన ధర సైతం పొందలేకపోతుండగా.. మరోవైపు మిల్‌పాయింట్ల వద్ద విక్రయిస్తుండటంతో ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ కోల్పోతున్నారు. సన్నరకాల బియ్యానికి బహిరంగ మార్కెట్లో బాగా గిరాకీ ఉన్నా వడ్లకు మాత్రం కనీస మద్దతు ధరకు మించి దక్కడం లేదు. ఈ సీజన్‌లో సన్నరకాల ధాన్యమంతా మిల్లులకే వస్తుండడంతో క్వింటాకు రూ.2,320 నుంచి గరిష్టంగా రూ.2,450 మించి కొనడం లేదు.

ధరను నియంత్రిస్తున్న మిల్లర్లు

డివిజన్ పరిధిలో రైతుల నుంచి ఈనెల 15 వరకు సన్నధాన్యం 67,424 క్వింటాళ్లు, దొడ్డు రకం 21,768 క్వింటాళ్లు సేకరించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సన్న రకానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,320 కాగా గరిష్టంగా క్వింటాకు రూ.2,450 వరకు ఇస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటాకు రూ.2,600, నుంచి రూ.2,800 వరకు ధర ఇచ్చారని, అదే రకం ధాన్యం, అదే స్థాయి నాణ్యతా ప్రమాణాలు ఈసారి కూడా పాటిస్తున్నా ధర తగ్గిస్తున్నారు. ఇదేమిటని రైతులు నిలదీస్తే తేమ శాతం 17 శాతం వరకే ఉండాలని, పచ్చివడ్లు తేమ 26, 28 శాతం వరకు ఉంటున్నాయని, దీంతో ధర ఇవ్వలేకపోతున్నామని మిల్లర్లు చెబుతున్నారు. ఈసారి రెట్టింపు ధాన్యం వస్తుండడంతో ధర పెరగకుండా సిండికేట్‌గా మారి కొనుగోళ్లు చేస్తున్నారనే చర్చ సాగుతోంది. కాగా, ప్రస్తుతం సన్నధాన్యం కొంటున్న మిల్లుల్లోని అత్యాధునిక సాంకేతికతతో ధాన్యం తేమశాతంతో సంబంధం ఉండదని, ఎంత పచ్చిగా ఉన్నప్పటికీ బాయిల్డ్ చేసే విషయంలో ఇబ్బంది రాకపోగా, పచ్చివడ్లయితేనే బియ్యం నూక శాతం తక్కువగా వస్తుందని, ధర తగ్గించేందుకే 17 శాతం తేమ నిబంధనను మిల్లర్లు తెరమీదకు తెచ్చి దగా చేస్తున్నారని రైతులు, సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం కొనుగోళ్ల ప్రక్రియ జరగడం లేదు. కేంద్రాల్లో విక్రయిస్తేనే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ వస్తుంది. పచ్చివడ్లు కొంటున్నారని, డబ్బులు వెంటనే చెల్లిస్తున్నారనే కారణాలతో రైతులు మిల్‌పాయింట్ల వద్దే నేరుగా ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో సన్నధాన్యం కొనాలంటే 17శాతానికి లోబడి తేమ, గింజపొడవు 6మి.మీటర్లకు లోబడి ఉండడంతో పాటు, తాలు, తేమ ఉండకూడదని చెబుతున్నారని, సన్నవడ్లను ఆరబెడితే తూకంలో తేడా వస్తుందని దీంతో మిల్లులకు నేరుగా అమ్ముతున్నామని రైతులు చెబుతున్నారు. సన్నధాన్యం ఎక్కడ అమ్ముకున్నా బోనస్ ఇవ్వాలని కోరుతున్నారు.

డివిజన్ పరిధిలో ఈనెల 15 వరకు రైతుల నుంచి దొడ్డు, సన్నరకం ధాన్యం సేకరించిన వివరాలు (అధికారుల లెక్కల ప్రకారం క్వింటాళ్లలో)

మండలం	దొడ్డు రకం	సన్న రకం
హుజూరాబాద్	767	21,527
జమ్మికుంట	3,007	10,806
ఇల్లందకుంట	1,680	9,520
వీణవంక	5,025	17,805
సైదాపూర్	11,289	7,766
మొత్తం	21,768	67,424

క్లుప్తంగా

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి ప్రభాకర్‌తో నాయకులు

శంకరపట్నం: బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం శంకరపట్నం కాంగ్రెస్ నాయకులు హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. కల్వల ప్రాజెక్టు మరమ్మతు, మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

దివ్యాంగులకు కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న సరస్వతి

హుజూరాబాద్: పట్టణంలోని విద్యానగర్‌లో యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థ వారి గ్రాస్ రూట్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి డీడబ్ల్యూవో సరస్వతి హాజరై మాట్లాడారు. దివ్యాంగులు మనోధైర్యం కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం హర్షణీయమన్నారు. కార్యక్రమానికి జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, శంకరపట్నం మండలాల నుంచి సుమారు 51 మంది దివ్యాంగులు హాజరయ్యారు.

బస్టాండ్‌లో దుకాణాల తనిఖీ


దుకాణాలను తనిఖీ చేస్తున్న డీఎం రవీంద్రనాథ్, అధికారులు

జమ్మికుంట: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న దుకాణాలను హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ శనివారం తనిఖీ చేశారు. అనుమతి లేని వస్తువులు అమ్ముతున్న దుకాణాదారులు రాజయ్య, శ్రీకాంత్‌కు రూ.500 చొప్పున జరిమానా విధించారు. బస్టాండ్ దుకాణాల్లో అనుమతి లేని, నిషేధిత వస్తువులు విక్రయిస్తే రూ.2వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న సాయిశ, మేఘన ఆర్‌బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు తాడికల్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శంకరపట్నం: నిర్మల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అండర్–17 బేస్‌బాల్ సెలక్షన్స్ ఈనెల 14న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించగా 9వ తరగతి విద్యార్థులు అర్చన, రిషిత, 8వ, తరగతి విద్యార్థి రామ్‌చరణ్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ఎంఈవో లక్ష్మీనారాయణ, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ కొరిమి మాధవి అభినందించారు.

శిశువు మృతిపై విచారణ

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఇటీవల శిశువు మృతి చెందగా, పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం అధికారులు విచారణ చేపట్టారు. ఖననం చేసిన శిశువు మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు కాకతీయ మెడికల్ కాలేజీ నుంచి ప్రొఫెసర్ సురేందర్ వచ్చారు. తహసీల్దార్ కనుకయ్య, సీఐ తిరుమల్ గౌడ్ పర్యవేక్షణలో శిశువు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి స్పందన

హుజూరాబాద్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో ఏటా వర్షాలు కురిసినప్పుడు కల్వర్టు కొట్టుకుపోతుండటంతో అధికారులు స్పందించాలంటూ ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా, పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే చిరు వ్యాపారుస్తులకు ఈ మార్గం సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఉప్పల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే జూపాక, బొత్తపల్లి, రంగాపూర్ గ్రామాల ప్రజలు ధర్మరాజుపల్లి గ్రామం మీదుగా ఈ మార్గం గుండా వెళ్లాల్సి ఉంటుంది.


కొనసాగుతున్న కల్వర్టు పనులు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జమ్మికుంట: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జమ్మికుంట ఎక్సైజ్ ఎస్సై సౌమ్య అన్నారు. శనివారం పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ విజయ రవీందర్, డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, చిరంజీవి, ప్రిన్సిపాల్ శివ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సాయికృష్ణ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధికారులు

రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో పుస్తక ప్రదర్శన

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక శిక్షణ పాఠశాలలో శనివారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాళహస్తి, డైరెక్టర్ కేశవ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లైబ్రేరియన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు.


పుస్తక ప్రదర్శనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రయోగాత్మక విద్య బోధించాలి

హుజూరాబాద్: విద్యార్థులకు అధ్యాపకులు ప్రయోగాత్మక విద్య బోధించాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజుల అటల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతిక నిపుణుల సేవలు పారిశ్రామిక రంగానికి ఎంతో అవసరమన్నారు. అధ్యాపకులు సాంకేతిక నిపుణులతో నిరంతరం చర్చించి సమాజంలో ఉన్న సాంకేతిక సమస్యలకు పరిష్కారం కనుగోనాలని పేర్కొన్నారు. ట్రైనింగ్‌లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థులతో సొంతగా ప్రాజెక్టులు తయారు చేయించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాజేశ్వర్ రావు, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ యోగేశ్ పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డైరెక్టర్ కందుకూరి శంకర్

సంక్షిప్త వార్తలు

• మోపెడ్‌లు అందించాలి

చిగురుమామిడి: అర్హులైన గీతకార్మికులకు ప్రభుత్వం మోపెడ్ (ద్విచక్ర వాహనం)లను అందించాలని సర్దార్ సర్వాయిపాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం ప్రకటనలో కోరారు. గ్రామాల్లో గీతకార్మికులను గుర్తించి కాటమయ్య రక్షణ కవచం కిట్లు అందించాలన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన గీతకార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచాలని కోరారు.

• పరామర్శ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లికి చెందిన సాయికిరణ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్‌వర్మ పరామర్శించారు.

• ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి రామడుగు మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన బద్దం మల్లవ్వ, లచ్చిరెడ్డి దంపతులు రూ.10,116 విరాళం అందించారు.

• బీజేపీ సభ్యత్వ నమోదు

గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లెలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి పర్శరామ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్టీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, దళితా మోర్చా మండల అధ్యక్షుడు బామండ్ల రాజు, సోషల్ మీడియా, సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ గూడెల్లి మల్లేశం, ఉపాధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు బొమ్మడి సురేందర్‌రెడ్డి, పీచు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ప్రపంచ పత్రిక దినోత్సవం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శనివారం ప్రపంచ పత్రిక దినోత్సవం సందర్భంగా మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పాత్రికేయులు కేక్ కట్ చేశారు. మాజీ సర్పంచ్ గోపగోని బస్వయ్య, షారూఖ్, తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

• వంతెన నిర్మించాలి

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి మానేరు వాగుపై వంతెన నిర్మిస్తే నాలుగు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని మల్లారెడ్డిపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సుల్తానాబాద్ మీదుగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు రవాణా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

నియామకం


రవి

చిగురుమామిడి: ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గాజుల రవిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తాల్ల నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఉపాధ్యక్షుడిగా నియమించిన అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హుజూరాబాద్: వరల్డ్ పైల్స్ డే పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కూరపాటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, వైద్యులు కూరపాటి రమేశ్, కూరపాటి రాధిక, సుధాకర్, కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అట్రాసిటి కేసుపై విచారణ


విచారణ చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

జమ్మికుంట: జమ్మికుంట పట్టణం, మండలంలోని నగురం గ్రామంలో శనివారం అట్రాసిటి కేసుపై హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి విచారణ చేపట్టారు. వివరాలు.. పద్మశాలీవాడలో నివాసముంటున్న ఈర్ల రజితను ఇంటి పక్కన ఉండే మడిపల్లి అనిల్ కులం పేరుతో దూషించాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. అలాగే నగురం గ్రామానికి చెందిన కవ్వంపల్లి లలితను అదే గ్రామానికి చెందిన పాశికంటి రాణి, తిరుపతి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు రాగా ఏసీపీ విచారణ చేపట్టారు. రెండు కేసులపై బహిరంగ విచారణ చేపట్టి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణలో ఎస్సై ఆరోగ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం జరగడం లేదని ఆత్మహత్యాయత్నం

చొప్పదండి: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కల్లెపల్లి ఆనంద్ తనకు న్యాయం జరగడం లేదని శనివారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆనంద్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రతలించారు. ఆనంద్ భార్య శారద కథనం ప్రకారం.. తమకు పట్టణంలో ఉన్న ఇంటి సమీపంలో సరిహద్దు వివాదం ఏర్పడింది. తమ స్థలంలో ఇతరులు ప్రహరీ పెడుతున్నారని ఇటీవల మున్సిపాల్టీలో, ఇతర చోట్ల ఫిర్యాదు చేసింది. కోర్టులో కేసు పెండింగ్ ఉండగా, వీరి స్థలంలో ప్రహరీ పెడుతున్నారని పోలీసులను సంప్రదించినా న్యాయం జరుగలేదని వాపోయింది. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంది. న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.


హుజూరాబాద్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో నివాస గృహాల మధ్య చెత్త నిల్వ ఉండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
టి.సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్, సెల్: 99899 30709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

భక్తాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో అతిపురాతనమైన భక్తాంజనేయస్వామికి శనివారం పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం చందనోత్సవం, హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. శేషం పరాంకుశం, దేశికర్, శేషం శ్రీనివాసాచార్యులు, చిట్టంపల్లి కనుకయ్య, చీకోటి రమణయ్య, తులాయిల కనుకయ్య, మాడిశెట్టి ఆంజనేయులు, జంగ రాజిరెడ్డి, చిట్టంపల్లి నారాయణ, బొల్లి సంపత్, బొల్లబత్తిని రాజేశం, జంగ శ్రీనివాస్‌రెడ్డి, రాజు, దేవేందర్‌రెడ్డి, రాములు, రాజిరెడ్డి, సంతోష్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలో భక్తులు

కార్తీక మాస దీపోత్సవం

జమ్మికుంట: కార్తీకమాసం పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలోని శ్రీరామాలయంలో శనివారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తాత్కాలిక కోనేరు ఏర్పాటు చేసి దీపాలు వదిలారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటాచార్యులు, ఆలయ చైర్మన్ ఇంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కోనేరులో దీపాలు వదులుతున్న భక్తులు

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ చైర్‌పర్సన్

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్వప్నసదానందం

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

• ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని మధురానగర్‌లో శనివారం పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. దేశానికి పల్లెలు పట్టుకొమ్మలని, పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటిలోని చెత్తను చెత్తబండిలో వేయాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బంది రోజూ చెత్తను డంపుయార్డుకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మధురానగర్‌లో అవసరమైన వీధుల్లో మురుగు కాలువలు నిర్మించాలని సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

ఇష్టంగా చదవాలి

• ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: విద్యార్థులు కష్టంగా కాకుండా.. ఇష్టంగా చదివితేనే రాణించగలుగుతారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. నుస్తులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతిలో పాఠాలు బోధించలన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, కవ్వంపల్లి యువసేన జిల్లా అధ్యక్షుడు నోముల అనిల్ కుమార్, ఎస్.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో శనివారం రాత్రి ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న 10క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. శ్రీనివాస్, రవి, నరసింహపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

జమ్మికుంట: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు అంబాల రమేశ్, తిరుపతి, డ్రైవర్లు వేల్పుల అనిల్‌కుమార్, సిరిసేటి అరవింద్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సర్వే పరిశీలన

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో శనివారం ఇంటింటి కుటుంబ సర్వేను తహసీల్దార్ భాస్కర్ పరిశీలించారు. మండలంలో 14,822 ఇళ్లు ఉండగా, 7,664 ఇళ్లలో సర్వే చేసినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. సర్వే సాఫీగా జరుగుతుందన్నారు.